# తెలంగాణ చౌరస్తా

తెలుగు దిన పత్రిక

epaper.telanganachowrasta.com
www.telanganachowrasta.com

సంపుటి: 02
సంచిక:72

24 క్యారెట్లు 144,730.00 | కిలో వెండి 1,99,900.00 | chourastha Digitals | 12.11.2026 గురువారం, హైదరాబాద్


## విద్యాసంస్థల్లో మూవీ ప్రమోషన్లకు బ్రేక్!

- విద్యార్థుల భద్రతే లక్ష్యంగా ప్రభుత్వం కీలక నిర్ణయం దిశగా అడుగులు
- విద్యాసంస్థల్లో సినిమా ప్రమోషన్లు, వాణిజ్య కార్యక్రమాలపై నిషేధానికి కసరత్తు
- విద్యార్థుల భద్రతపై చట్టం రూపొందించిన ఉన్నత విద్యామండలి
- ప్రభుత్వానికి ముసాయిదా సమర్పణ.. త్వరలో అధికారిక ఉత్తర్వులు వచ్చే అవకాశం
- దాండియా వేడుకలో ట్రస్ కూలి విద్యార్థిని మృతి.. పలువురికి గాయాలు

2లో






## దేశంలోనే క్లీన్ సిటీగా నవీ ముంబయి..

- మూడో స్థానంలో విజయవాడ!
- స్వచ్ఛ సర్వేక్షణ్ 2026లో ఏపీ నగరాల సత్తా
- రెండో స్థానంలో సూరత్.. అగ్రస్థానంలో నవీ ముంబయి
- 10 లక్షలకు పైగా జనాభా విభాగంలో విశాఖకు నంబర్ వన్ ర్యాంక్
- 3 నుంచి 10 లక్షల జనాభా కేటగిరీలో గుంటూరుకు మూడో స్థానం
- ఎనిమిదేళ్లుగా టాప్‌లో ఉన్న ఇండౌర్‌కు ఈసారి నిరాశ

2లో

## రెండు కుటుంబాల ఆధిపత్యానికి చెక్..

- రాజకీయ మార్పులకు శ్రీకారం!
- పరివర్తన రాజనీతి పార్టీని ప్రకటించిన విజయసాయిరెడ్డి
- 2029 ఎన్నికల్లో అన్ని నియోజకవర్గాల్లో పోటీ చేస్తాం
- 66 శాతం ఎమ్మెల్యే, ఎంపీ టికెట్లు యువతకే
- బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు పాలనలో సముచిత ప్రాధాన్యం
- ప్రతి మూడు నెలలకోసారి ప్రభుత్వ ఆదాయ, వ్యయాలపై శ్వేతపత్రం

2లో







## తెలంగాణ విద్యావ్యవస్థలో కీలక మార్పులు..

### 10+2 విధానం అమలుకు సీఎం ఆదేశాలు

### వచ్చే విద్యా సంవత్సరం నుంచే నూతన విధానం అమలు చేయాలని సూచన

### 9 నుంచి 12వ తరగతి వరకు ఉన్నత విద్యగా పరిగణన.. నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యం

### ఒక్క విద్యార్థికీ నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం

తెలంగాణ విద్యావ్యవస్థలో కీలక సంస్కరణలకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. వచ్చే విద్యా సంవత్సరం నుంచే రాష్ట్రంలో 10+2 విద్యావిధానాన్ని అమలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. బోధి పెవెలియన్‌లో విద్యాశాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఈ మేరకు కీలక సూచనలు చేశారు.

**హైదరాబాద్ తెలంగాణ చౌరస్తా:**

ఆధునిక అవసరాలకు అనుగుణంగా రాష్ట్ర విద్యావిధానంలో మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందని సీఎం అభిప్రాయపడ్డారు. 9 నుంచి 12వ తరగతి వరకు ఉన్నత విద్యగా పరిగణించి, విద్యార్థులకు ప్రత్యేక బోధన అందించాలని సూచించారు. 12వ తరగతి నుంచి విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని వెల్లడించారు.

**నర్సరీ నుంచి 12వ తరగతి వరకు ప్రాధాన్యం**


విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రైవేటు

।మిగతా 2 లో।

## ఆంధ్రాకు నీళ్లు.. తెలంగాణకు ఎక్కిళ్లా?

- కృష్ణా, గోదావరి జలాలను ఏపీ వినియోగించుకుంటుంటే
- తెలంగాణ ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉంది?
- రైతుల కన్నీళ్ల కంటే సీఎం దృష్టి గడ్డంపైనే ఉంది
- నిర్మల్ రైతు గర్జన సభలో కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ విమర్శలు

2లో





సంక్షేమం కంటే రాజకీయాలే ముఖ్యమయ్యాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. కృష్ణా, గోదావరి నదుల నీటిని ఆంధ్రప్రదేశ్ వినియోగించుకుంటుంటే తెలంగాణ ప్రభుత్వం చూస్తూ ఉండిపోయిందని ఆరోపించారు. బుధవారం నిర్మల్‌లో బీఆర్ఎస్ నిర్వహించిన రైతు గర్జన మహాసభలో ఆయన ప్రసంగించారు. రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులు ప్రకృతి తెచ్చిన కరువు కాదని, పాలకుల వైఫల్యంతో ఏర్పడిన కరవని వ్యాఖ్యానించారు.



## ఆక్రమణల చెర నుంచి తమ్మిడికుంటకు విముక్తి

- రూ.20 కోట్లతో 30 ఎకరాల్లో చెరువు పునరుద్ధరణ
- చెరువు చుట్టూ ఆహ్లాదకర వాతావరణం.. వాకింగ్ ట్రాక్, రోజ్ గార్డెన్ ఏర్పాటు
- చెరువుల ఆక్రమణలపై ఉక్కుపాదం
- కనుమరుగైన జలవనరుల పునరుద్ధరణకు చర్యలు
- తమ్మిడికుంట సుందరీకరణతో స్థానికులకు ఆహ్లాదం
- మూసీ ప్రక్షాళనకు ఇదే స్ఫూర్తి కావాలి..నాగార్జున
- నగర చెరువుల పునరుద్ధరణతో భూగర్భ జలాల పెరుగుదల
- అభివృద్ధికి అడ్డంకులు ఎదురైనా.. భవిష్యత్ ప్రయోజనాలే ముఖ్యం
- జలవనరుల పరిరక్షణలో హైడ్రా మరో ముందడుగు: సీఎం రేవంత్‌రెడ్డి

2లో

## రైతులకు గుడ్‌న్యూస్.. ఎరువుల సబ్సిడీకి కేంద్రం ఆమోదం

- రబీ సీజన్ 2026–27 కోసం రూ.62,370 కోట్ల కేటాయింపు
- 50 కేజీల డీఏపీ బస్తా ధర రూ.1,350గానే కొనసాగింపు
- ముద్రా రుణాల క్రెడిట్ గ్యారెంటీ పథకానికి మరో ఐదేళ్ల పొడిగింపు
- స్టాండప్ ఇండియా పథకం గడువు 2031 వరకు పెంపు
- యుగే యుగీన్ మ్యూజియం, నోయిడా మెట్రో ప్రాజెక్టులకు కేబినెట్ గ్రీన్‌సిగ్నల్


2లో



## రష్యా–ఉక్రెయిన్ చర్చల్లో కీలక ముందడుగు!

- భారీ సంఖ్యలో యుద్ధ ఖైదీల విడుదలకు ఇరుదేశాల అంగీకారం
- అబుదాబి వేదికగా రెండు రోజుల పాటు చర్చలు
- అమెరికా మధ్యవర్తిత్వంతో కుదిరిన ఒప్పందం
- పుతిన్‌తో భేటీ కానున్న అమెరికా ప్రతినిధులు
- యుద్ధ విరమణ దిశగా మరింత వేగం కానున్న దౌత్య ప్రయత్నాలు

2లో





# ఆంధ్రాకు నీళ్లు.. తెలంగాణకు ఎక్కిళ్లా?

**తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో :**



సంక్షేమం కంటే రాజకీయాలే ముఖ్యమయ్యాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. కృష్ణా, గోదావరి నదుల నీటిని ఆంధ్రప్రదేశ్ వినియోగించుకుంటుంటే తెలంగాణ ప్రభుత్వం చూస్తూ ఉండిపోయిందని ఆరోపించారు. బుధవారం నిర్మల్‌లో బీఆర్ఎస్ నిర్వహించిన రైతు గర్జన మహాసభలో ఆయన ప్రసంగించారు. రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులు ప్రకృతి తెచ్చిన కరువు కాదని, పాలకుల వైఫల్యంతో ఏర్పడిన కరవని వ్యాఖ్యానించారు. పట్టిసీమ వద్ద ఏపీ నీటిని ఎత్తిపోస్తుంటే, కన్నెపల్లి పద్ద తెలంగాణ ప్రభుత్వం ఎందుకు పంపులు ప్రారంభించడం లేదని ప్రశ్నించారు. ఆంధ్రాకు నీళ్లు వెళ్తుంటే తెలంగాణ రైతులకు ఇబ్బందులు ఎందుకు ఎదురవుతున్నాయని నిలదీశారు. రైతులు, సాగునీటి ప్రాజెక్టులపై ముఖ్యమంత్రికి పట్టింపు లేదని విమర్శించారు.ఉమ్మడి ఆదిలాబాద్ రైతుల కోసం కేసీఆర్ సదర్మాట్ బ్యారేజీ నిర్మించినప్పటికీ, దానిని పూర్తిస్థాయిలో వినియోగించుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని కేటీఆర్ ఆరోపించారు. కాళేశ్వరం నుంచి నిజాంసాగర్‌కు నీటిని ఎత్తిపోసి ఉంటే ఎల్‌నినో ప్రభావం ఉన్నా రైతులకు ఇన్ని ఇబ్బందులు వచ్చేవి కావని అన్నారు. రైతుల సమస్యలపై దృష్టి పెట్టాల్సిన సీఎం రేవంత్‌రెడ్డి తన గడ్డం గురించి ఎక్కువగా ఆలోచిస్తున్నారని ఎద్దేవా చేశారు. ఎల్‌నినో ప్రభావంపై రైతులకు భరోసా కల్పించడం లేదని విమర్శించారు.కరోనా సమయంలో కేసీఆర్ ప్రజలకు అండగా నిలిచారని గుర్తుచేశారు.ప్రజల దృష్టిమళ్లించేందుకు గ్రామాల్లో నాటకాలు వేయాలని సీఎం చెబుతున్నారని, నాటకాలు, ఉపన్యాసాలతో రైతుల కడుపు నిండదని వ్యాఖ్యానించారు.ఆదిలాబాద్ జిల్లాలోని గూడేలను కేసీఆర్ గ్రామపంచాయతీలుగా మార్చారని, జిల్లాలో 4.5 లక్షల ఎకరాలకు పోడు పట్టాలు అందించారని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రతి గ్రామానికి ట్రాక్టర్ కొనిచ్చామని, వాటికి డీజిల్ పోయించేందుకు కూడా ప్రస్తుత ప్రభుత్వానికి చేత కావడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మూడేళ్లలో రూ.4.5 లక్షల కోట్ల అప్పు చేసిందని ఆరోపించారు. అమ్మఒడి వాహనాలు, గర్భిణులు, బాలింతలకు అందించే ప్రసూతి సహాయం నిలిచిపోయాయని అన్నారు. విద్యా భరోసా ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రస్తుతం రూ.12 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెట్టిందని విమర్శించారు.

ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. కృష్ణా, గోదావరి నదుల్లోని సుమారు వెయ్యి టీఎంసీల నీటిని వినియోగించుకుండా దిగువకు వదిలేశారని ఆరోపించారు. పట్టిసీమ వద్ద ఏపీ నీటిని ఎత్తిపోస్తుంటే కన్నెపల్లి, దేవాదుల వద్ద తెలంగాణ ప్రభుత్వం పంపులు ఎందుకు ప్రారంభించలేదని ప్రశ్నించారు.శ్రీశైలం నీటిని కుప్పం వరకు తీసుకెళ్తున్నారని, పక్కనే ఉన్న పాలమూరు రైతుల పొలాలు మాత్రం ఎందుకు ఎండిపోతున్నాయని నిలదీశారు. హైదరాబాద్‌లో భూములను విక్రయిస్తున్నారని, హామీల అమలుకు నిధులు ఎందుకు ఖర్చు చేయడం లేదో ప్రజలు ఆలోచించాలని అన్నారు.

**మిగిలిన రైతు రుణమాఫీ పూర్తి చేయాలి**

ఉద్యోగాల ప్రకటనలు విడుదల చేయకుండా, నిరుద్యోగ భృతి చెల్లించకుండా యువతను ఇబ్బందులకు గురిచేస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. ప్రభుత్వ ఉద్యోగులకు పీఆర్సీ, డీఏలు, రిటైర్డ్ ఉద్యోగులకు పింఛన్లు సక్రమంగా అందడం లేదని విమర్శించారు. రంజాన్ తోఫా, క్రిస్మస్ గిఫ్ట్, కేసీఆర్ కిట్ వంటి పథకాలు నిలిచిపోయాయని అన్నారు. రైతుల బ్యాంకు రుణాలను వెంటనే రీషెడ్యూల్ చేయాలని, మిగిలిన రైతు రుణమాఫీని కూడా పూర్తిచేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

**కాంగ్రెస్, బీజేపీ రెండూ ఒకటే**

నిర్మల్ నియోజకవర్గానికి బీజేపీ ఎమ్మెల్యే చేసిందేమీ లేదని కేటీఆర్ ఆరోపించారు. మన్యం ప్రాంత ప్రజల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని కేసీఆర్ నిర్మల్‌ను జిల్లాగా ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. రాష్ట్రంలో బీజేపీకి చెందిన ఎనిమిది మంది ఎమ్మెల్యేలు, ఎనిమిది మంది ఎంపీలు ప్రజలకు ఉపయోగపడకుండా అష్టగ్రహాల్లా మారారని విమర్శించారు. కాంగ్రెస్, బీజేపీ రెండు పార్టీలు ఒకే తీరుగా వ్యవహరిస్తున్నాయని వ్యాఖ్యానించారు.



# తెలంగాణ విద్యావ్యవస్థలో కీలక మార్పులు..

**తరువాయి భాగం**

పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దాలన్నదే ప్రభుత్వ సంకల్పమని తెలిపారు.

**ఒక్క విద్యార్థికీ నష్టం జరగకూడదు**

10+2 విధానం అమలులో భాగంగా ఎలాంటి మార్పులు చేపట్టినా ఒక్క విద్యార్థికీ నష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని సంస్కరణలు అమలు చేయాలని స్పష్టం చేశారు. నూతన విధానం ద్వారా విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు భవిష్యత్తులో ఉపాధి అవకాశాలకు అవసరమైన నైపుణ్యాలు అందేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు.ఈ సమీక్ష సమావేశంలో ప్రభుత్వ సలహాదారులు కె. కేశవరావు, సుదర్శన్‌రెడ్డి, ఎంపీ వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, విద్యాశాఖ ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ఆక్రమణల చెర నుంచి తమ్మిడికుంటకు విముక్తి

**హైదరాబాద్ తెలంగాణ చౌరస్తా :**

ఆక్రమణలతో కుంచించుకుపోయిన హైదరాబాద్ మాదాపూర్‌లోని తమ్మిడికుంట చెరువుకు హైడ్రా పునరుజ్జీవం కల్పించింది. సుమారు రూ.20 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేసిన చెరువును ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి సినీనటుడు అక్కినేని నాగార్జున గౌరవ అతిథిగా హాజరయ్యారు. చెరువు అభివృద్ధికి నాగార్జున అందించిన సహకారాన్ని సీఎం ప్రత్యేకంగా ప్రశంసించారు.

**14 ఎకరాల నుంచి 30 ఎకరాలకు విస్తరణ**

ఒకప్పుడు సుమారు 30 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న తమ్మిడికుంట చెరువు ఆక్రమణల కారణంగా 14 ఎకరాలకు కుంచించుకుపోయిందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. హైడ్రా చర్యలతో తిరిగి 30 ఎకరాల విస్తీర్ణంలో పునరుద్ధరించామని చెప్పారు. ప్రభుత్వ నిర్ణయాలు కొందరికి కష్టం, నష్టం కలిగించినా.. మంచి నిర్ణయాల వల్ల భవిష్యత్ తరాలకు మేలు జరుగుతుందని స్పష్టం చేశారు.ఎన్నికలు వచ్చినప్పుడు రాజకీయాలు చేసుకుందామని, ప్రస్తుతం నగర అభివృద్ధి కోసం అందరూ కలిసి రావాలని రాజకీయ పార్టీలకు పిలుపునిచ్చారు. హైటెక్ సిటీతో పాటు తమ్మిడికుంట కూడా నగరానికి ప్రత్యేక గుర్తింపుగా నిలవాలని ఆకాంక్షించారు. ఐటీ ఉద్యోగులు 'పర్క్ ఫ్రమ్ తమ్మిడికుంట' అని చెప్పుకునేలా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని అధికారులకు సూచించారు. చెరువుకు భద్రత కల్పించడంతో పాటు సందర్శకులకు అవసరమైన అన్ని వసతులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

**నాగార్జున నిజ జీవితంలోనూ హీరోనే**

తమ్మిడికుంట అభివృద్ధి కోసం సినీనటుడు అక్కినేని నాగార్జున రెండెకరాల స్థలాన్ని ఉదారంగా అందించారని సీఎం రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు. సినిమాల్లోనే కాకుండా నిజ జీవితంలోనూ నాగార్జున హీరోనే అని ప్రశంసించారు. హైదరాబాద్ చుట్టుపక్కల ఎన్నో చెరువులు ఆక్రమణలకు గురయ్యాయని, ఓఆర్ఆర్ పరిధిలోని 1,372 చెరువుల్లో సుమారు 50 శాతం కనుమరుగయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. నీటి ప్రవాహ మార్గాలను ఆక్రమిస్తే.. చివరకు ఆ నీరే మన జీవితాలను ప్రభావితం చేస్తుందని హెచ్చరించారు. హైదరాబాద్ నాగరికత మూసీ పరివాహక ప్రాంతంలోనే అభివృద్ధి చెందిందని పేర్కొన్నారు.

**త్వరలో ఇక్కడే సినిమా షూటింగ్: నాగార్జున**

నగరంలో చెరువుల పునరుద్ధరణ ఎంతో అవసరమని అక్కినేని నాగార్జున అన్నారు. హైదరాబాద్ వ్యాప్తంగా సుమారు 2 వేల చెరువులు ఉన్నాయని, వాటిని కూడా తమ్మిడికుంట తరహాలో అభివృద్ధి చేస్తే నగరానికి అవసరమైన 42 టీఎంసీల నీటి విషయంలో ఇబ్బందులు తగ్గుతాయని అభిప్రాయపడ్డారు. గతంలో భారీ వర్షాలు కురిసినప్పుడు చెరువులోకి నీరు వెళ్లక రోడ్లపై నిలిచిపోయేదని, తాను కూడా శిల్పారామం సమీపంలో పలుమార్లు ట్రాఫిక్‌లో చిక్కుకున్నానని గుర్తుచేశారు. చెరువు పునరుద్ధరణ తర్వాత పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలమట్టం సుమారు నాలుగు మీటర్ల వరకు పెరిగిందని హైడ్రా కమిషనర్ రంగనాథ్ వివరించినట్లు తెలిపారు. మరో భారీ వర్షం కురిస్తే చెరువు నిండుగా మారి మరింత అందంగా కనిపిస్తుందని, త్వరలో ఇక్కడ సినిమా షూటింగ్ కూడా చేస్తానని చెప్పారు. ఇదే సంకల్పంతో సీఎం రేవంత్‌రెడ్డి ముందుకు సాగాలని, మూసీ సుందరీకరణ పూర్తయ్యాక ప్రారంభోత్సవానికి తనను ఆహ్వానిస్తారని ఆశిస్తున్నట్లు నాగార్జున పేర్కొన్నారు.

**చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్.. యోగా వేదిక**

తమ్మిడికుంటను రూ.20 కోట్లతో సుందరంగా తీర్చిదిద్దినట్లు అధికారులు తెలిపారు. చెరువు చుట్టూ 1.2 కిలోమీటర్ల పొడవున వాకింగ్ ట్రాక్ నిర్మించారు. ట్రాక్‌కు ఇరువైపులా మొక్కలు నాటి ల్యాండ్‌స్కేపింగ్ చేపట్టారు. సందర్శకుల కోసం బెంచీలు, యోగా వేదిక, రోజ్ గార్డెన్ ఏర్పాటు చేశారు. ఏడాదిన్నరలోనే అభివృద్ధి పనులు పూర్తి చేసినట్లు హైడ్రా కమిషనర్ రంగనాథ్ వెల్లడించారు. భారీ వర్షాల సమయంలో తమ్మిడికుంట పరిసర ప్రాంతాల్లో వరద నీటితో ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యేవని తెలిపారు. చెరువుల పరిరక్షణకు యువత నుంచి కూడా పెద్ద ఎత్తున మద్దతు లభిస్తోందని చెప్పారు.

**34 మందికి ఇందిరమ్మ ఇళ్ల పత్రాలు**

చెరువుల అభివృద్ధిలో భాగంగా ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్) పరిధిలోని గుడిసెలను కోల్పోయిన బాధితులకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పత్రాలు అందజేసింది.ఇందులో భాగంగా ఉప్పల్ నియోజకవర్గంలోని రామంతాపూర్ పెద్దచెరువు పరిధిలో గుడిసెలు కోల్పోయిన 34 మందికి సీఎం రేవంత్‌రెడ్డి ఇందిరమ్మ ఇళ్ల పత్రాలను పంపిణీ చేశారు.



# దేశంలోనే క్లీన్ సిటీగా నవీ ముంబయి..

**నేషనల్ బ్యూరో (తెలంగాణ చౌరస్తా):**

దేశంలో అత్యంత పరిశుభ్రమైన నగరంగా మహారాష్ట్రకు చెందిన నవీ ముంబయి అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది.కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన స్వచ్ఛ సర్వేక్షణ్ 2026లో గుజరాత్‌లోని సూరత్ రెండో స్థానంలో నిలవగా, ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ మూడో స్థానాన్నిదక్కించుకుంది. దిల్లీలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము విజేతలకు స్వచ్ఛతా పురస్కారాలను ప్రదానం చేశారు.

**విశాఖకు అగ్రస్థానం.. గుంటూరుకూ గుర్తింపు**

10 లక్షలకు పైగా జనాభా కలిగిన నగరాల విభాగంలో గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) దేశంలోనే అత్యంత పరిశుభ్రమైన నగరంగా మొదటి స్థానాన్ని దక్కించుకుంది. ఈ విభాగంలో జబల్‌పుర్ రెండో స్థానంలో, లఖ్‌నవూ మూడో స్థానంలో నిలిచాయి.3 నుంచి 10 లక్షల జనాభా విభాగంలో మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయిని మొదటి స్థానంలో నిలవగా, చండీగఢ్ రెండో స్థానాన్ని దక్కించుకుంది. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు మూడో స్థానంలో నిలిచి ప్రత్యేక గుర్తింపు పొందింది.

**టాప్ జాబితాలో లేని ఇండౌర్**

గత ఎనిమిదేళ్లుగా వరుసగా దేశంలోనే అత్యంత పరిశుభ్రమైన నగరంగా అగ్రస్థానంలో నిలిచిన మధ్యప్రదేశ్‌లోని ఇండౌర్ ఈసారి టాప్ జాబితాలో చోటు దక్కించుకోలేదు. గతేడాది ఇండౌర్ మొదటి స్థానంలో నిలవగా, సూరత్, నవీ ముంబయి తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఈసారి నవీ ముంబయి అగ్రస్థానానికి చేరగా, సూరత్ రెండో స్థానంలో నిలిచింది. ఇతర రాష్ట్రాల ప్రత్యేక జాబితాల్లో రాజస్థాన్‌లోని జైపూర్ అత్యంత పరిశుభ్రమైన నగరంగా గుర్తింపు పొందింది. మధ్యప్రదేశ్ నుంచి గ్వాలియర్ ఈ ఘనతను దక్కించుకుంది.

**3ప్రత్యేక విభాగాల్లో విజేతలు వీరే..**

కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (MoHUA) పలు ప్రత్యేక విభాగాల్లోనూ విజేతలను ప్రకటించింది. నదీ తీర పట్టణాల విభాగంలో మధ్యప్రదేశ్‌లోని రేవా మొదటి స్థానంలో నిలిచింది. ఛత్తీస్‌గఢ్‌లోని బిలాస్‌పుర్ రెండో స్థానంలో, ఉత్తరప్రదేశ్‌లోని వారణాసి మూడో స్థానంలో నిలిచాయి. స్వచ్ఛ తీర ప్రాంత పట్టణాల విభాగంలో ఒడిశాలోని పూరీ అగ్ర స్థానాన్ని దక్కించుకోగా, కేరళలోని అలప్పుళ రెండో స్థానంలో, మహారాష్ట్రలోని రత్నగిరి మూడో స్థానంలో నిలిచాయి.

క్లీనెస్ట్ హిమాలయన్ సిటీ విభాగంలో ఉత్తరాఖండ్‌లోని రుద్రపుర్ మొదటి స్థానంలో నిలవగా, జమ్మూ రెండో స్థానాన్ని దక్కించుకుంది.

**మెంటార్ సిటీగా అహ్మదాబాద్.. తిరుపతికి మూడో స్థానం**

మెంటార్ సిటీ విభాగంలో గుజరాత్‌లోని అహ్మదాబాద్ మొదటి స్థానంలో నిలిచింది. ఇండౌర్ రెండో స్థానంలో, ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి మూడో స్థానాన్ని దక్కించుకుంది. స్వచ్ఛ షెహర్ జోడీ కార్యక్రమంలో భాగంగా పెద్ద నగరాలను చిన్న పట్టణాలతో అనుసంధానించారు. ఇందులో సనంద్‌ను అహ్మదాబాద్‌తో, దేపాల్‌పుర్‌ను ఇండౌర్‌తో, ఆంధ్రప్రదేశ్‌లోని కుప్పంను తిరుపతితో జత చేశారు. ఈ కార్యక్రమం ద్వారా చిన్న పట్టణాలకు పరిశుభ్రత నిర్వహణలో పెద్ద నగరాల అనుభవం, మార్గదర్శకత్వం అందించనున్నారు.ఇతర అవార్డుల్లో అత్యుత్తమ పనితీరు కనబరిచిన నగరాల విభాగంలో హరియాణాలోని కర్నాల్ రాష్ట్రపతి పురస్కారాన్ని అందుకుంది. పట్టణ పారిశుద్ధ్య ప్రమాణాల్లో ప్రతిభ కనబరిచినందుకు ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పుర్, బిలాస్‌పుర్, బిల్హా నగరాలకు ప్రత్యేక గుర్తింపు లభించింది.

**4,751 పట్టణ స్థానిక సంస్థల మధ్య పోటీ**

స్వచ్ఛ భారత్ మిషన్-అర్బన్ (SBMU) ప్రారంభమై పదేళ్లు పూర్తయిన సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. 'స్వచ్ఛతా కీ నయా పహల్ - బధాయే హాత్, కరే సఫాయీ సాథ్' అనే థీమ్‌తో నిర్వహించిన ఈ సర్వేలో దేశవ్యాప్తంగా 4,751 పట్టణ స్థానిక సంస్థలను 43 రకాల ప్రమాణాల ఆధారంగా అంచనా వేసి విజేతలను ఎంపిక చేశారు.2016లో కేవలం 73 పట్టణ స్థానిక సంస్థలతో ప్రారంభమైన స్వచ్ఛ సర్వేక్షణ్.. తాజా ఎడిషన్ నాటికి 4,751 పట్టణ స్థానిక సంస్థలకు విస్తరించింది.దేశవ్యాప్తంగా పట్టణ పరిశుభ్రతలో పోటీని పెంచుతూ, నగరాల పనితీరును అంచనా వేసే కీలక కార్యక్రమంగా ఈ సర్వే కొనసాగుతోంది.



# విద్యాసంస్థల్లో మూవీ ప్రమోషన్లకు బ్రేక్!

**హైదరాబాద్ తెలంగాణ చౌరస్తా :**

రాష్ట్రంలోని విద్యాసంస్థల్లో సినిమా ప్రమోషన్లు, ప్రైవేట్ కార్యక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ కళాశాలలు, విశ్వవిద్యాలయాల ప్రాంగణాల్లో నిర్వహించే కార్యక్రమాలపై నియంత్రణ విధించాలని యోచిస్తోంది. ఇటీవల విద్యాసంస్థల్లో నిర్వహించిన కొన్ని ప్రైవేట్ కార్యక్రమాల్లో భద్రతా లోపాలు బయటపడటం, ప్రమాదాలు చోటుచేసుకోవడంతో ప్రభుత్వం ఈ దిశగా దృష్టి సారించినట్లు తెలుస్తోంది.

**విద్యామండలి చైర్మన్ ఆధ్వర్యంలో ముసాయిదా**

విద్యాసంస్థల్లో ఎలాంటి కార్యక్రమాలకు అనుమతి ఇవ్వాలి? ఏయే ఈవెంట్లను నిషేధించాలి? అనే అంశాలపై సమగ్ర అధ్యయనం చేయాలని విద్యా శాఖ అధికారులను ప్రభుత్వం ఆదేశించినట్లు సమాచారం. విద్యాసంస్థల ప్రాంగణాలను ప్రధానంగా విద్యా, క్రీడా సంబంధిత కార్యకలాపాలకే వినియోగించాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. సినిమా ప్రమోషన్లు, ఇతర వాణిజ్య కార్యక్రమాలకు విద్యాసంస్థలను వేదికలుగా మార్చకూడదనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం.

చిన్నపాటి కార్యక్రమాల నిర్వహణకు అభ్యంతరం లేకపోయినా, బయటి వ్యక్తులు పందల సంఖ్యలో హాజరయ్యే ఈవెంట్ల విషయంలో కఠినమైన భద్రతా నిబంధనలు అమలు చేయాలని యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి విద్యాసంస్థల్లో విద్యార్థుల భద్రతకు సంబంధించి చట్టం రూపొందించే చర్యలు చేపట్టారు. దీనికి సంబంధించిన ముసాయిదాను సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పించినట్లు సమాచారం. త్వరలోనే దీనిపై అధికారిక ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉంది.

**దాండియా వేడుకలో విషాదం**

ఇటీవల హైదరాబాద్ నగరంలోని ఓ ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన దాండియా వేడుక విషాదానికి దారితీసింది. ఈ కార్యక్రమానికి వెయ్యిమందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. వేడుకల కోసం కళాశాల ప్రాంగణంలో లైటింగ్ ట్రస్ ఏర్పాటు చేశారు. అమ్మాయిలు, అబ్బాయిలకు వేర్వేరుగా విభాగాలు ఏర్పాటు చేసినప్పటికీ, భద్రతా ఏర్పాట్లలో లోపాలు ఉన్నట్లు తెలుస్తోంది. వేడుకలు ప్రారంభమైన కొద్దిసేపటికే ఈదురు గాలులు వీచాయి. దీంతో రాత్రి 7.30 నుంచి 7.45 గంటల మధ్య అమ్మాయిల కోసం ఏర్పాటు చేసిన లైటింగ్ ట్రస్ ఒక్కసారిగా కూలిపోయింది. నృత్యాల కోసం ఏర్పాటు చేసిన సౌండ్ సిస్టమ్ శబ్దం కారణంగా తొలుత అక్కడ ఏం జరిగిందో విద్యార్థులకు అర్థం కాలేదు. కొద్దిసేపటికే పలువురు విద్యార్థులు లైటింగ్ స్తంభాల కింద చిక్కుకుని సాయం కోసం కేకలు వేశారు.

**విద్యార్థిని మృతి.. పలువురికి గాయాలు**

ఇతర విద్యార్థులు వెంటనే స్పందించి ట్రస్ కింద చిక్కుకున్న వారిని బయటకు తీశారు. అప్పటికే పలువురు స్పృహ కోల్పోయారు. క్షతగాత్రులను హుటాహుటిన సమీప ఆసుపత్రులకు తరలించారు. అయితే బీటెక్ ప్రథమ సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థిని అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలి కవల సోదరి కూడా అదే కళాశాలలో చదువుతుండగా, ఈ ప్రమాదంలో ఆమెకు సైతం గాయాలయ్యాయి. ఈ ఘటన విద్యాసంస్థల్లో పెద్దఎత్తున నిర్వహించే ప్రైవేట్ కార్యక్రమాల భద్రతపై ఆందోళన కలిగించింది. ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా ఉండేందుకు ప్రభుత్వం కొత్త నిబంధనల దిశగా అడుగులు వేస్తోంది.

# రష్యా–ఉక్రెయిన్ చర్చల్లో కీలక ముందడుగు!

**అంతర్జాతీయం (తెలంగాణ చౌరస్తా):**





దాదాపు ఐదేళ్లుగా కొనసాగుతున్న రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికే దిశగా కీలక పరిణామం చోటుచేసుకుంది. అమెరికా మధ్యవర్తిత్వంతో అబుదాబి వేదికగా రెండు రోజుల పాటు జరిగిన చర్చల్లో రష్యా, ఉక్రెయిన్ దేశాలు భారీ సంఖ్యలో యుద్ధ ఖైదీలను పరస్పరం అప్పగించేందుకు అంగీకరించాయి. మానవతా దృక్పథంతో ఖైదీల విడుదలకు ఇరుపక్షాలు ముందుకు రావడం చర్చల్లో సానుకూల పరిణామంగా భావిస్తున్నారు.

ఈ విషయాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అల్లుడు, అమెరికా ప్రతినిధి జారెడ్ కుష్నర్ వెల్లడించారు.విడుదల చేయనున్న ఖైదీల సంఖ్యను గురువారం ఖరారు చేయనున్నట్లు తెలిపారు. యుద్ధాన్ని ముగించే దిశగా దౌత్యపరమైన ప్రయత్నాలను మరింత వేగవంతం చేస్తామని పేర్కొన్నారు.

**పుతిన్‌తో భేటీ కానున్న అమెరికా ప్రతినిధులు**

అబుదాబి చర్చల అనంతరం తదుపరి దౌత్య చర్యల్లో భాగంగా అమెరికా ప్రత్యేక ప్రతినిధి స్టీవ్ విట్‌కాఫ్, జారెడ్ కుష్నర్ గురువారం మాస్కోకు వెళ్లనున్నారు. అక్కడ రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో సమావేశమై చర్చల్లో సాధించిన పురోగతిని వివరించనున్నారు. అనంతరం ఐర్లాండ్‌లోని దబ్లిన్‌లో ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీతో భేటీ అయి, అబుదాబి చర్చల్లో ప్రస్తావనకు వచ్చిన ప్రతిపాదనలపై చర్చించనున్నారు.

ఈ సందర్భంగా కుష్నర్ మాట్లాడుతూ.. చర్చల్లో సాధించిన పురోగతిని ఇరుదేశాల నాయకులకు వివరించి, మరిన్ని అంశాల్లో ముందడుగు వేసేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు. మానవతా సహాయ చర్యలు, యుద్ధ ఖైదీల విడుదలతో పాటు చర్చల్లో యూరోపియన్ దేశాలను భాగస్వాములను చేసే అంశాలపై దృష్టి సారిస్తామని పేర్కొన్నారు.

**కొన్ని అంశాలపై ఇంకా భేదాభిప్రాయాలు**

మరోవైపు, అబుదాబిలో బుధవారం జరిగిన చర్చలు రెండు గంటల లోపే ముగిశాయి. అనంతరం రష్యా ప్రధాన ప్రతినిధి వ్లాదిమిర్ మెడిన్స్కీ మాట్లాడుతూ.. కొన్ని అంశాలపై పరస్పర అవగాహన కుదిరినప్పటికీ, మరికొన్ని అంశాల్లో భేదాభిప్రాయాలు కొనసాగుతున్నాయని తెలిపారు. చర్చల ప్రక్రియను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఉక్రెయిన్ విదేశీ ఇంటెలిజెన్స్ చీఫ్ రుస్తెం ఉమెరోవ్ కూడా అమెరికా ప్రతినిధుల దౌత్య ప్రయత్నాలకు ధన్యవాదాలు తెలిపారు. భద్రతాపరమైన అంశాల్లో కీలక పురోగతి సాధించినట్లు వెల్లడించారు. అయితే ఇరు దేశాల మధ్య విభేదాలు ఇంకా కొనసాగుతున్నాయని ఉక్రెయిన్ సంధానకర్త డేవిడ్ అరాఖమియా పేర్కొన్నారు. 2022 నుంచి తాను ఈ చర్చల ప్రక్రియలో ఉన్నానని, ఇప్పటివరకు జరిగిన సంప్రదింపుల్లో ఇవి అత్యంత కఠినమైనవని వ్యాఖ్యానించారు.

**అమెరికా వైఖరిపై యూరప్‌లో ఆందోళన**

రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించేందుకు ట్రంప్ ప్రభుత్వం దౌత్య ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నప్పటికీ, అమెరికా అనుసరిస్తున్న చర్చల విధానంపై యూరోపియన్ దేశాల్లో ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ట్రంప్ ఇటీవల చేసిన ప్రకటనల్లో మాస్కోకు అనుకూలంగా కొన్ని కీలక రాయితీలు ఉన్నాయని సీఎన్ఎన్ పేర్కొంది. యుద్ధ ఖైదీల విడుదలకు అంగీకారం కుదరడం సానుకూల పరిణామమే అయినప్పటికీ, పూర్తిస్థాయి యుద్ధ విరమణ దిశగా ఇరుదేశాలు ఏకాభిప్రాయానికి వస్తాయా అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలు చిరస్మరణీయం

- దేశ విద్యారంగ అభివృద్ధికి విశేష కృషి చేసిన మహనీయుడు
- ఆయన ఆశయాలను కొనసాగించాలి: జగదీశ్వర్ గౌడ్

**శేరిలింగంపల్లి (తెలంగాణ చౌరస్తా):**

భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రిగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ దేశ విద్యారంగ అభివృద్ధికి అందించిన సేవలు చిరస్మరణీయమని టీపీసీసీ కార్యదర్శి, శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్ గౌడ్ అన్నారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా బుధవారం చందానగర్‌లో నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొని నివాళులర్పించారు.

**ఈ సందర్భంగా జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ..**

1888 నవంబర్ 11న మక్కాలో జన్మించిన మౌలానా అబుల్ కలాం ఆజాద్ స్వాతంత్ర్య సమరయోధుడిగా, గొప్ప విద్యావేత్తగా, రచయితగా



దేశానికి విశేష సేవలందించారని కొనియాడారు. స్వాతంత్ర్యం అనంతరం తొలి కేంద్ర విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టి, 1958 ఫిబ్రవరి 22 వరకు ఆ పదవిలో కొనసాగారని గుర్తుచేశారు. దేశంలోని ప్రతి చిన్నారికి విద్య అందాలనే లక్ష్యంతో 14 ఏళ్లలోపు పిల్లలకు ఉచిత నిర్బంధ విద్య కల్పించాలని ఆయన ఆకాంక్షించారని తెలిపారు. మహిళా విద్య, సాంకేతిక విద్య, ఉన్నత విద్య అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చారని పేర్కొన్నారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ), ఐఐటీ ఖరగ్‌పూర్ వంటి విద్యాసంస్థల అభివృద్ధికి పునాదులు వేయడంలో కీలక పాత్ర పోషించారని విపరించారు.అలాగే సంగీత నాటక అకాడమీ, సాహిత్య అకాడమీ, లలిత కళా అకాడమీల ఏర్పాటులోనూ ఆయన కృషి మరువలేనిదన్నారు. విద్య ద్వారానే సమాజంలో సమానత్వం, అభివృద్ధి సాధ్యమని విశ్వసించిన ఆజాద్ ఆశయాలను ప్రతి ఒక్కరూ కొనసాగించాలని పిలుపునిచ్చారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ జన్మదినమైన నవంబర్ 11ను ఏటా జాతీయ విద్యా దినోత్సవంగా నిర్వహిస్తున్నామని, విద్యారంగానికి ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా 1992లో మరణానంతరం భారతరత్న పురస్కారం ప్రదానం చేశారని తెలిపారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ప్రభాకర్ రెడ్డి, మహిళా అధ్యక్షురాలు సునీత రెడ్డి, రంగారెడ్డి జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఆయాజ్ అహ్మద్ ఖాన్, లేబర్ సెల్ అధ్యక్షుడు మోహన్ రెడ్డి, చంద్ర మౌళి, గఫూర్, అనిత, పార్వతి, శాంత, జయ తదితరులు పాల్గొన్నారు.



# క్రమశిక్షణే విజయానికి మూలం

- విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి
- పెద్దపల్లి డీసీపీ బి. రాంరెడ్డి

**సుల్తానాబాద్, తెలంగాణ చౌరస్తా :**

క్రమశిక్షణే విజయానికి మూలమని పెద్దపల్లి డీసీపీ బీ. రాంరెడ్డి అన్నారు. బుధవారం సుల్తానాబాద్ సర్కిల్ పోలీసుల ఆధ్వర్యంలో గర్రెపల్లి మోడల్ స్కూల్ విద్యార్థులకు డ్రగ్స్ నిర్మూలన, మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై గర్రెపల్లిలోని ఎస్వీఎస్ ఫంక్షన్ హాల్ లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డీసీపీ బీ. రాంరెడ్డి, ప్రవచనకర్త శ్రీ ఎస్వీ నాయక్ హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు వివరించారు. డ్రగ్స్ కు అలవాటు అయితే బంగారు జీవితం నాశనం అవుతుందని తెలిపారు. డ్రగ్స్ లేని సమాజం విద్యార్థులతోనే సాధ్యమని, డ్రగ్స్ వాడినట్లు అనుమానం వస్తే 1908 నెంబర్ కు డయల్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. విద్యార్థులు చెడు అలవాట్లకు బానిసలు కాకుండా, గొప్ప లక్ష్యాన్ని ఎంచుకొని జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకునేలా ముందుకు పోవాలని సూచించారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలన్నారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పేర్కొన్నారు. ఇక్కడ సుల్తానాబాద్ సీఐ పి. రంజిత్ రావు, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ గోల్డి బల్జీర్ కౌర్, ఎస్ఐ చంద్రకుమార్, ఎలిగేడు ఎస్ఐ మధుకర్, కాల్వ శ్రీరాంపూర్ ఎస్ఐ సుధాకర్, పోలీస్ సిబ్బంది, అధ్యాపక బృందం, సుమారు 500 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

## డిప్యూటీ సిఎం భట్టిని కలిసిన
# గూడూరు సతీష్ కుమార్

**హనుమకొండ, తెలంగాణ చౌరస్తా:**

హనుమకొండ జిల్లాలో పలు ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు,ప్రభుత్వ పథకాల ప్రారంభోత్సవాలకు విచ్చేసిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కని జిల్లా కాంగ్రెస్ నాయకులు గూడూరు సతీష్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రికి శాలువా కప్పి సత్కరించి,పుష్పగుచ్ఛం అందజేశారు.ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఇనుగాల వెంకటరామిరెడ్డి,హనుమకొండ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి,వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు,పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి,కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) చైర్మన్ గుండు సుధారాణి,తెలంగాణ రాష్ట్ర మహిళా



కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



# యాసంగి పంటల సాగుపై రైతులకు అవగాహన

**కాల్వ శ్రీరాంపూర్, తెలంగాణ చౌరస్తా:**

కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని పందిల్ల గ్రామంలో ఎల్‌నినో ప్రభావం దృష్ట్యా యాసంగి పంటల సాగు,పంటల మార్పిడిపై రైతులకు అవగాహన కార్యక్రమని నిర్వహించారు.ఈ సందర్భంగా ఏఈఓ శ్రీనివాస్ మాట్లాడుతూ.... రైతులు యాసంగి సీజన్‌లో నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని వరి సాగుకు బదులుగా ఆరుతడి పంటలైన శనగ,మొక్కజొన్న,జొన్న, కుసుమ తదితర పంటలను సాగు చేయాలని సూచించారు.పంటల మార్పిడి విధానాన్ని పాటించడం ద్వారా భూసారాన్ని కాపాడుకోవడంతో పాటు,తక్కువ నీటితో అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు.వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని వ్యవసాయ శాఖ సూచనలు పాటిస్తూ రైతులు పంటలు సాగు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మిట్టపల్లి కొమురయ్య, ఉప సర్పంచ్ దర్మల రవి,గ్రామ పంచాయతీ కార్యదర్శి మహేందర్,వార్డు సభ్యులు ఇల్లందుల శంకర్,చిలుముల వినేష్,రైతులు,గ్రామ ప్రజలు, పాల్గొన్నారు.





# మహానేత దేశిని చిన్న మల్లయ్యకు ఘన నివాళులు

- కల్లుగీత కార్మికుల హక్కుల కోసం పోరాడిన దేశిని చిన్న మల్లయ్య
- మాజీ ఎమ్మెల్యే 9వ వర్ధంతి సందర్భంగా ఘనంగా సంస్మరణ సభ
- పూలమాలలతో నివాళులర్పించిన నాయకులు

**పెద్దపల్లి, తెలంగాణ చౌరస్తా:**

కల్లుగీత కార్మిక ఉద్యమ నేత, మాజీ ఎమ్మెల్యే దేశిని చిన్న మల్లయ్య 9వ వర్ధంతి సందర్భంగా పెద్దపల్లి పట్టణంలోని నందన గార్డెన్‌లో సంస్మరణ సభ నిర్వహించారు.మాజీ జడ్పీటీసీ, ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో దేశిని చిన్న మల్లయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా సారయ్య గౌడ్ మాట్లాడుతూ...దేశిని చిన్న మల్లయ్య సామాన్య కుటుంబం నుంచి రాజకీయాల్లోకి వచ్చి, సర్పంచిగా ప్రజా జీవితాన్ని ప్రారంభించి, నాలుగు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై ప్రజలకు సేవలందించిన గొప్ప నాయకుడని కొనియాడారు.కల్లుగీత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఆయన ఎన్నో పోరాటాలు చేశారని,కార్మికుల హక్కుల సాధన కోసం నిరంతరం కృషి చేశారని గుర్తు చేశారు.పదవులు,రాజకీయాలకు అతీతంగా ప్రజల సమస్యలే తన సమస్యలుగా భావించి పని చేసిన వ్యక్తి దేశిని చిన్న మల్లయ్య అని అన్నారు. ఆయన చేసిన సేవలు నేటి తరానికి ఆదర్శం. ముఖ్యంగా కల్లుగీత కార్మికుల సంక్షేమం కోసం ఆయన సాగించిన పోరాటాలను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని,ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని సారయ్య గౌడ్ పిలుపునిచ్చారు.దేశిని చిన్న మల్లయ్య భౌతికంగా మన మధ్య లేకపోయినా ప్రజల కోసం ఆయన చేసిన సేవలు,కార్మికుల హక్కుల కోసం సాగించిన ఉద్యమాలు ఎప్పటికీ ప్రజల గుండెల్లో నిలిచిపోతాయని పేర్కొన్నారు. అనంతరం పలువురు నాయకులు,అభిమానులు ఆయనకు ఘనంగా నివాళులర్పించి,ఆయనతో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో కేజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షులు రమణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు,కేజీకేఎస్ ఉపాధ్యక్షులు నరసయ్య,ఉపాధ్యక్షులు సాంబయ్య,సర్వాయి పాపన్న రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు సింగం సత్తయ్య గౌడ్,మాకు దెబ్బ రాష్ట్ర అధ్యక్షులు జాగిరి అంజి గౌడ్,గౌడ సంఘం జిల్లా అధ్యక్షులు కోట రవి గౌడ్,పడాల కొమురయ్య,రైతు సంఘం నాయకులు మునిమడుగుల మల్లన్న ఉమ్మడి జిల్లా గౌడ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పట్టాల డెడ్ లైన్ దాటిన గూడ్స్ రైలు ఇంజన్

- తప్పిన ప్రమాదం.. ఊపిరి పీల్చుకున్న స్థానికులు
- అప్రమత్తమైన అధికారులు.. మరమ్మత్తులు చేపట్టిన రైల్వే సిబ్బంది
- పెద్దపల్లి - కూనారం రైల్వే గేట్ సమీపంలో ఘటన

**పెద్దపల్లి, తెలంగాణ చౌరస్తా :**

పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని కూనారం రైల్వే గేట్ సమీపంలో ఓ గూడ్స్ రైలు ఇంజన్ పట్టాల డెడ్ లైన్ దాటింది. బుధవారం తెల్లవారుజామున ఈ ఘటన చోటు చేసుకోవడంతో, రైల్వే అధికారులు ఒక్కసారిగా అప్రమత్తమయ్యారు. కాగా, ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రాణ నష్టం కానీ, ఆస్తి నష్టం కానీ సంభవించకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. సాధారణంగా సూపర్ ఫాస్ట్, ఎక్స్ ప్రెస్ రైళ్ల రాకపోకలకు లైన్ క్లియర్ చేసే క్రమంలో, స్టేషన్ల వద్ద నిలిపిన రైళ్లను ఇతర ట్రాక్ లైన్లకు తరలిస్తుంటారు. ఇందులో భాగంగా



బోగీలను షంటింగ్ చేస్తున్న సమయంలో గూడ్స్ రైలు ఇంజన్ నిర్ణీత పట్టాల డెడ్ లైన్ దాటి ఒక్కసారిగా ముందుకు వెళ్లిపోయింది. సమాచారం అందుకున్న రైల్వే అధికారులు, సిబ్బంది తక్షణమే స్పందించి, మరమ్మత్తు పనులు ప్రారంభించారు. ఇంజన్ ను తిరిగి యథాస్థితికి తీసుకువచ్చేందుకు రైల్వే సిబ్బంది ఘటనా స్థలంలో ట్రాక్ పునరుద్ధరణ చర్యలు చేపట్టారు. ఇంజన్ పట్టాల డెడ్ లైన్ దాటడానికి గల కారణాలపై రైల్వే అధికారులు ఆరా తీసి, దర్యాప్తు చేపట్టారు.

## ఐకేపీ,సింగిల్ విండో
# కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

- మహిళా సంఘాల భవనాలకు భూమి పూజలు
- ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు

**ఓదెల, తెలంగాణ చౌరస్తా:**

ఓదెల మండలంలోని కొలనూరు, రూపునారాయణపేట,బయమ్మపల్లి,గుంపుల గ్రామాల్లో 40 లక్షల రూపాయల నిధులతో మహిళా సంఘాల భవనాల నిర్మాణం కోసం భూమి పూజలు చేసిన అనంతరం రూపునారాయణపేట,బయమ్మపల్లి,గుంపుల,గుండెం గ్రామాల్లో ఐకేపీ,సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు .ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు,సింగిల్ విండో చైర్మన్,పలువురు సర్పంచ్లు, ఉపసర్పంచ్లు ,ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు, మహిళా సంఘాలు,రైతులు గ్రామస్తులు,తదితరులు, పాల్గొన్నారు.


# రెండు కుటుంబాల ఆధిపత్యానికి చెక్..

**విజయవాడ, తెలంగాణ చౌరస్తా:**

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో కొత్త మార్పులకు శ్రీకారం చుట్టామని, రాష్ట్ర భవిష్యత్తు ఏ ఒక్క నేత చేతుల్లోనో, రెండు కుటుంబాల ఆధిపత్యంలోనో ఉండకూడదని మాజీ ఎంపీ, పరివర్తన రాజనీతి పార్టీ అధ్యక్షుడు విజయసాయిరెడ్డి అన్నారు. రాష్ట్రంలో సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న కుటుంబ రాజకీయాలకు, అహంకారపూరిత నాయకత్వానికి ప్రత్యామ్నాయంగా తమ పార్టీ పనిచేస్తుందని ప్రకటించారు. విజయవాడ వేదికగా తన నూతన రాజకీయ పార్టీ పేరును 'పరివర్తన రాజనీతి పార్టీ' (పీఆర్‌పీ)గా వెల్లడించారు.ఈ సందర్భంగా విజయసాయిరెడ్డి మాట్లాడుతూ.. పదవులు, రాజకీయ వారసత్వాలు కుటుంబాల నుంచి మాత్రమే రావాల్సిన అవసరం లేదని, కష్టం, అనుభవం, ప్రజల మద్దతుతోనూ ఉన్నత స్థానాలను సాధించవచ్చని తన రాజకీయ ప్రస్థానమే నిరూపించిందన్నారు.

**వైఎస్సార్‌సీపీ నాయకత్వంపై విమర్శలు**

గతంలో వైఎస్సార్‌సీపీ నిర్మాణం కోసం ఎంతో కష్టపడి పనిచేసిన తనకు చివరకు అవమానమే మిగిలిందని విజయసాయిరెడ్డి అన్నారు. నాయకత్వాన్ని గౌరవించడం విధేయతే కానీ, అది బానిసత్వంగా మారకూడదని వ్యాఖ్యానించారు.2019 ఎన్నికల్లో 151 స్థానాలు కట్టబెట్టిన ప్రజలు, 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని 11 స్థానాలకే ఎందుకు పరిమితం చేశారో మాజీ సీఎం వైఎస్ జగన్ ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. ప్రజలు సంక్షేమ పథకాలను తిరస్కరించలేదని, నాయకుడి అహంకారపూరిత వైఖరిని, కార్యకర్తలను దూరం చేసుకున్న రాజకీయ సంస్కృతిని తిరస్కరించారని వ్యాఖ్యానించారు.




**టీడీపీ ప్రభుత్వంపైనా విమర్శలు**

గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను చంద్రబాబు ప్రభుత్వం విస్మరించిందని ప్రజలు ప్రశ్నిస్తున్నారని విజయసాయిరెడ్డి అన్నారు. పోస్టర్లలో కనిపిస్తున్న అభివృద్ధి క్షేత్రస్థాయిలో కనిపించడం లేదని విమర్శించారు. రాష్ట్ర అప్పులు పుష్కర కాలంలో లక్ష కోట్ల రూపాయల నుంచి దాదాపు రూ.10 లక్షల కోట్లకు చేరాయని, అదే సమయంలో ఆశించిన స్థాయిలో సంపద సృష్టి జరగలేదని ఆరోపించారు.ఉద్యోగాలు లేక యువత, గిట్టుబాటు ధరలు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగం, రాజకీయ కక్షసాధింపు చర్యలు కొనసాగితే టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వానికి ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. తిరుమల లడ్డూ వివాదం వంటి సున్నితమైన అంశాలను రాజకీయాలకు ఉపయోగించుకుంటూ హిందువుల మనోభావాలతో ఆడుకోవడం శోచనీయమని అన్నారు. తమ పార్టీ ఏ ఒక్కరికీ బీటీమ్ కాదని, ఐదు కోట్ల ఆంధ్రుల ఆత్మ గౌరవానికి మాత్రమే జవాబుదారీగా ఉంటుందని స్పష్టం చేశారు.

**66 శాతం టికెట్లు యువతకే..**

2029 అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో పోటీ చేసి విజయం సాధించడమే తమ లక్ష్యమని విజయసాయిరెడ్డి ప్రకటించారు. సామాజిక న్యాయంలో భాగంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు కేవలం పార్టీ కార్యక్రమాల్లోనే కాకుండా రాష్ట్ర ప్రభుత్వాన్ని నడిపించే స్థాయిలోనూ ప్రాతినిధ్యం కల్పిస్తామని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యే, ఎంపీ టికెట్లలో 66 శాతం జెన్‌జీ, యువతకు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. యువతకు రాజకీయాల్లో నిర్ణయాధికారం కల్పించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.

# రైతులకు గుడ్‌న్యూస్.. ఎరువుల సబ్సిడీకి కేంద్రం ఆమోదం

**తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో :**

రైతులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. రబీ సీజన్ 2026-27లో ఫాస్ఫేట్,పొటాష్ ఎరువుల కోసం రూ.62,370 కోట్ల సబ్సిడీని అందించేందుకు కేంద్ర మంత్రిపర్గం ఆమోదం తెలిపింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారం జరిగిన కేబినెట్ సమావేశంలో ఈ నిర్ణయంతోపాటు పలు కీలక ప్రతిపాదనలకు ఆమోదముద్ర వేసింది. సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు.

**ముద్రా రుణాల పథకానికి మరో ఐదేళ్లు**

సూక్ష్మ పరిశ్రమలకు రుణ భరోసా కల్పించే 'క్రెడిట్ గ్యారెంటీ ఫండ్ ఫర్ మైక్రో యూనిట్స్' (సీజీఎఫ్ఎంయూ) పథకాన్ని మరో ఐదేళ్లపాటు పొడిగించేందుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. దీంతో ఈ పథకం 2031 మార్చి వరకు కొనసాగనుంది. ప్రధానమంత్రి ముద్రా యోజన ప్రారంభమైనప్పటి నుంచి 2026 సెప్టెంబర్ వరకు బ్యాంకులు, ఇతర రుణ సంస్థలు 60.36 కోట్లకు పైగా రుణాలు మంజూరు చేశాయి.వీటి మొత్తం విలువ రూ.43.34 లక్షల కోట్లు.రుణాలు తిరిగి చెల్లించలేని పరిస్థితుల్లో బ్యాంకులు, రుణ సంస్థలకు సీజీఎఫ్ఎంయూ పథకం ద్వారా క్రెడిట్ గ్యారెంటీ రక్షణలభిస్తుంది.ఈ పథకానికి రూ.5 వేల కోట్ల నిధులు కేటాయించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. తద్వారా రూ.12.6 లక్షల కోట్ల విలువైన ముద్రా రుణాలకు మరింత ఊతం లభించనుంది. 2016 జనవరిలో ప్రారంభమైన ఈ పథకం సూక్ష్మ పరిశ్రమలకు రుణాల అందుబాటును పెంచడంలో కీలకంగా పనిచేస్తోందని



కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ పేర్కొన్నారు.

**స్టాండప్ ఇండియా గడువు పొడిగింపు**

మహిళలు, షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీ), షెడ్యూల్డ్ తెగల (ఎస్టీ) పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించే స్టాండప్ ఇండియా పథకాన్ని మరో ఐదేళ్లపాటు కొనసాగించాలని కేంద్రం నిర్ణయించింది. ఈ పథకం గడువును 2031 మార్చి 31 వరకు పొడిగించింది. రానున్న ఐదేళ్లలో అదనంగా 2.5 లక్షల మంది ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఆర్థిక సాయం అందించనున్నట్లు కేంద్ర మంత్రి తెలిపారు. 2016 ఏప్రిల్‌లో పథకం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు 2.75 లక్షల మందికి పైగా మహిళలు, ఎస్సీ, ఎస్టీ వ్యాపారవేత్తలకు రుణాలు అందించారు. కొత్తగా గ్రీన్‌ఫీల్డ్ సంస్థలను ఏర్పాటు చేసేందుకు ప్రతి షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంకు శాఖ ద్వారా కనీసం ఒక ఎస్సీ లేదా ఎస్టీ లబ్ధిదారునికి,కనీసం ఒక మహిళకు రూ.10 లక్షల నుంచి రూ.1 కోటి వరకు రుణాలు అందించడం ఈ పథకం లక్ష్యం. తయారీ, సేవలు, వాణిజ్యం, వ్యవసాయ అనుబంధ రంగాల్లో వ్యాపారాలు ప్రారంభించేందుకు ఈ రుణాలు ఉపయోగపడనున్నాయి. ఈ రుణాలకు గరిష్ఠంగా 18 నెలల మారటోరియం ఉంటుంది.రుణాన్ని ఏడేళ్లలోపు తిరిగి చెల్లించాల్సి ఉంటుంది.రుణ మొత్తంలో 85 శాతానికి క్రెడిట్ గ్యారెంటీ కల్పిస్తారు. ప్రామాణిక గ్యారెంటీ ఫీజు 0.50 శాతంగా ఉంటుంది.

**డీఏపీ బస్తా ధర రూ.1,350గానే..**

రబీ సీజన్ 2026-27 కోసం ఫాస్ఫేట్, పొటాష్ ఎరువులకు రూ.62,370 కోట్ల సబ్సిడీ అందించేందుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. పశ్చిమాసియా సంక్షోభం, రష్యా-ఉక్రెయిన్ యుద్ధం కారణంగా అంతర్జాతీయంగా ఎరువుల ధరలు పెరిగాయని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. ఈ నేపథ్యంలో రైతులపై భారం పడకుండా సబ్సిడీకి ఆమోదం తెలిపినట్లు వివరించారు. 50 కేజీల డీఏపీ బస్తా ధర గతంలో మాదిరిగానే రూ.1,350గా కొనసాగుతుందని స్పష్టం చేశారు.

**మ్యూజియం, మెట్రో ప్రాజెక్టులకు ఆమోదం**

దేశ రాజధానిలోని నార్త్, సౌత్ బ్లాక్ భవనాలను మ్యూజియంగా మార్చేందుకు చేపట్టనున్న 'యుగే యుగీన్ మ్యూజియం' అభివృద్ధికి రూ.3,230 కోట్లు కేటాయించేందుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. అలాగే నోయిడా సెక్టార్ 51 నుంచి గ్రేటర్ నోయిడా సెక్టార్ 4 వరకు రూ.2,390 కోట్లతో మెట్రో రైలు మార్గం ఏర్పాటు చేసే ప్రతిపాదనకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.రైతులకు ఎరువుల సబ్సిడీతోపాటు సూక్ష్మ పరిశ్రమలు, మహిళా పారిశ్రామికవేత్తలు, ఎస్సీ, ఎస్టీ వర్గాల వ్యాపారాలకు రుణ భరోసా కల్పించేలా కేంద్ర మంత్రివర్గం పలు నిర్ణయాలు తీసుకుంది.

## శబరిమలై యాత్రకు తొర్రూరు
# ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సులు

- 36 మంది భక్తులు ఉంటే ప్రత్యేక బస్సు బుకింగ్‌కు అవకాశం
- కేరళ సరిహద్దు పన్ను మినహాయింపు..ప్రయాణ మార్గాన్ని ఎంచుకునే వెసులుబాటు



**తొర్రూరు, తెలంగాణ చౌరస్తా:**

కార్తీక మాసం, అయ్యప్ప స్వామి మాలధారణ నేపథ్యంలో శబరిమలై యాత్రకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం టీజీఎస్ఆర్టీసీ తొర్రూరు డిపో ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు డిపో మేనేజర్ కె. ప్రసూన లక్ష్మి తెలిపారు. కనీసం 36 మంది భక్తులు ఒక బృందంగా ఏర్పడితే ప్రత్యేక బస్సును బుక్ చేసుకునే అవకాశం కల్పిస్తున్నట్లు వెల్లడించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రత్యేక బస్సుల్లో ప్రయాణించే భక్తులకు కేరళ రాష్ట్ర సరిహద్దు పన్ను నుంచి మినహాయింపు ఉంటుందని తెలిపారు. అంతేకాకుండా భక్తులు తమకు అనుకూలమైన ప్రయాణ మార్గాన్ని స్వయంగా ఎంపిక చేసుకునే వెసులుబాటు కూడా కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.శబరిమలై యాత్రతో పాటు కార్తీక మాసంలో ఇతర పుణ్యక్షేత్రాలు, తీర్థ యాత్రలకు వెళ్లే భక్తులకు కూడా ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. అదేవిధంగా వివాహాలు, ఇతర శుభకార్యాల కోసం కూడా ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసేందుకు తొర్రూరు డిపో సిద్ధంగా ఉందన్నారు.అనుభవజ్ఞులైన డ్రైవర్ల తో సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించడమే టీజీఎస్ఆర్టీసీ లక్ష్యమని పేర్కొన్నారు. తొర్రూరు పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల అయ్యప్ప స్వామి భక్తులు, గురుస్వాములు, భక్త బృందాలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

**బుకింగ్, వివరాల కోసం సంప్రదించాల్సిన నంబర్లు:**
- 9959226053
- 9963991518



# పెంచిన ఆస్తి పన్నులను తగ్గించండి

- ఎమ్మెల్యే యశస్విని రెడ్డికి చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధుల వినతి
- 10 నుంచి 12 రెట్లు పెరిగిన పన్నులతో ప్రజలు, వ్యాపారులపై తీవ్ర భారం
- కనీసం 50 శాతం తగ్గించాలని డిమాండ్

**తొర్రూరు, తెలంగాణ చౌరస్తా:**

తొర్రూరు మున్సిపాలిటీ పరిధిలో గృహ, వాణిజ్య ఆస్తులపై అసాధారణంగా పెంచిన పన్నులను తక్షణమే తగ్గించాలని చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం పాలకుర్తి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ తూణం శ్రవణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ వక్కల శ్యాంసుందర్‌లను కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా చాంబర్ ఆఫ్ కామర్స్, జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. తొర్రూరు మున్సిపాలిటీ పరిధిలోని గృహాలు, దుకాణాలు, ప్రైవేటు పాఠశాలలు, ఆసుపత్రులు, వాణిజ్య సముదాయాలపై గతంలో ఉన్న పన్నులతో పోలిస్తే 10 నుంచి 12 రెట్లు అధికంగా విధించడం ఆందోళనకరమని పేర్కొన్నారు. ఇప్పటికే నిత్యావసర సరుకుల ధరలు, విద్యుత్ ఛార్జీలు, వ్యాపార నిర్వహణ ఖర్చులు పెరిగి ప్రజలు, చిరు వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆస్తి పన్నుల పెంపు వారిపై అదనపు ఆర్థిక భారాన్ని మోపుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

**కనీసం 50 శాతం పన్నులు తగ్గించాలి**

ఇటీవల మరిపెడ మున్సిపాలిటీలో ఆస్తి పన్నుల విషయంలో ప్రభుత్వం ఉపశమనం కల్పించిన తరహాలోనే తొర్రూరు ప్రజలకు కూడా న్యాయం చేయాలని నాయకులు కోరారు. పెంచిన ఆస్తి పన్నుల్లో కనీసం 50 శాతం మేర తగ్గించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.వినతిపై ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు చాంబర్ ప్రతినిధులు తెలిపారు. పన్నుల పెంపునకు సంబంధించిన పూర్తి వివరాలను పరిశీలించి ప్రజలకు అనుకూలంగా తగిన నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు మచ్చ సురేష్, ఉపాధ్యక్షుడు పెరుమాళ్ల చక్రపాణి, కోశాధికారి చిదురాల శ్రీనివాస్, జేఏసీ నాయకులు తమ్మర విశ్వేశ్వరరావు, ఎ. దేవేందర్‌రెడ్డి, మధుకర్‌రెడ్డి, రమేష్, ముత్తినేని జయప్రకాష్, మొగుళ్ల రవీంద్రనాథ్, వ్యాపారులు ప్రతాపని వెంకటేశ్వర్లు, ఇమ్మడి రాంబాబు, కె.వి. రెడ్డి, తోట శ్రీనివాస్, దొడ్డ శ్రీనివాస్, కొల్లూరి రాంబాబు, కొనకళ్ల లక్ష్మీనారాయణ, కూరపాటి సోమయ్య, కందగట్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత

- ర్యాకల్ దేవ్ పల్లి శివాలయంలో ప్రత్యేక పూజలు
- పెద్దపల్లి మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ డాక్టర్ మమతా రెడ్డి

**సుల్తానాబాద్/ఎలిగేడు, తెలంగాణ చౌరస్తా :**

ఆధ్యాత్మిక చింతన తోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని పెద్దపల్లి మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ డాక్టర్ మమతా రెడ్డి అన్నారు. బుధవారం ఎలిగేడు మండలంలోని ర్యాకల్ దేవ్ పల్లి శివాలయంలోని స్వామివారిని దర్శించుకొని, ఆమె ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మమతా రెడ్డి మాట్లాడుతూ..శివుని అనుగ్రహంతో నియోజకవర్గ ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో, పాడి పంటలతో సుభిక్షంగా ఉండాలని, ప్రతి ఒక్కరీ జీవితాల్లో శాంతి, సంతోషాలు నింపాలని ఆకాంక్షించారు. ఆలయాల్లో నిర్వహించే ఆధ్యాత్మిక కార్యక్రమాలు మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. అనంతరం మమతా రెడ్డికి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు.



ఇక్కడ ఎలిగేడు మాజీ ఎంపీపీ తానిపర్తి ప్రవంతి మోహన్ రావు, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు రాంరెడ్డి, సుల్తానాపూర్, నారాయణపూర్ సర్పంచులు బాపు, గొడుగుల సతీష్, కోమల రెడ్డి, సమ్మయ్య, వినోద్, తిరుపతి రెడ్డి, పలువురు మహిళలు, నాయకులు ఉన్నారు.







# భద్రాచలం పోలీస్ స్టేషన్‌లో ఎస్పీ ఆకస్మిక తనిఖీ

- ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించాలి
- ఎస్పీ రోహిత్‌రాజు ఐపీఎస్
- పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలి
- విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరిక

**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, తెలంగాణ చౌరస్తా:**

ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించడంతో పాటు బాధితుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు ఐపీఎస్ పోలీస్ సిబ్బందికి సూచించారు. బుధవారం భద్రాచలం పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాలు, రికార్డులు, ఫిర్యాదుల స్వీకరణ తీరు, సిబ్బంది విధుల నిర్వహణను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం వివిధ విభాగాల సిబ్బందితో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులతో సిబ్బంది మర్యాదగా, స్నేహపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు.

**పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి**

వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. నాణ్యమైన దర్యాప్తు చేపట్టి కేసులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.


**అసాంఘిక కార్యకలాపాలపై నిఘా పెంచాలి**

పోలీసు సిబ్బంది ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, పోలీసింగ్ వెబ్ అప్లికేషన్లపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఎస్పీ సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై నిరంతరం నిఘా ఉంచి, చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి**

పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలను అప్రమత్తం చేసేందుకు గ్రామాలు, పట్టణాల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. పెట్రోలింగ్, బ్లూకోల్ట్స్ సిబ్బంది నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలని, డయల్ 112 ద్వారా అత్యవసర సమాచారం అందిన వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులకు సహాయం అందించాలని సూచించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను ఎస్పీ అడిగి తెలుసుకున్నారు.సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ వారి సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సంక్షేమాన్ని రేవంత్ సర్కార్ గాలికొదిలేసింది



- ఖానాపురంలో ఎండిన పంటలను పరిశీలించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

**తొర్రూరు-తెలంగాణ చౌరస్తా:**

రైతుల కన్నీళ్లు, ఆవేదన, ఆగ్రహం కాంగ్రెస్ ప్రభుత్వానికి తగలక తప్పదని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం విఫలమైందని, రైతుల సమస్యలను పట్టించుకోకుండా రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తోందని విమర్శించారు.బుధవారం మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం ఖానాపురం గ్రామంలో ఎండిపోయిన పంట పొలాలను ఆయన పరిశీలించి బాధిత రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన రైతులు ఈదునూరి రవీందర్, సోమన్న తమ పంట నష్టాన్ని మాజీ మంత్రికి వివరించారు. ఐదు ఎకరాల్లో మొక్కజొన్న, మరో ఎకరంలో వరి సాగు చేశామని, విత్తనాలు, ఎరువులు, దుక్కులు, కూలీల ఖర్చులతో కలిపి సుమారు రూ.1.20 లక్షలు పెట్టుబడి పెట్టామని తెలిపారు. సరైన సాగునీరు అందక పంటలు ఎండిపోవడంతో పెట్టిన పెట్టుబడి కూడా తిరిగి వచ్చే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తామని హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రస్తుతం రైతుల కష్టాలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు.అప్పులు చేసి సాగు చేసిన రైతులు పంటలు ఎండిపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నారని, అయినప్పటికీ ప్రభుత్వం నుంచి కనీస భరోసా లభించడం లేదన్నారు. పెట్టుబడి సాయం, పంట నష్టపరిహారం అందించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు.కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి రెండు టీఎంసీల నీటిని ఎత్తిపోసే అవకాశం ఉన్నప్పటికీ, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు పేరు వస్తుందనే రాజకీయ కారణాలతోనే నీటిని వినియోగించడం లేదని ఆయన ఆరోపించారు. రైతుల ప్రయోజనాల కంటే రాజకీయాలే ముఖ్యమా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రాజకీయ కక్షలు పక్కనపెట్టి రైతుల పంటలను కాపాడేందుకు తక్షణమే సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు.ఎండిపోయిన పంటలకు వెంటనే నష్టపరిహారం ప్రకటించి బాధిత రైతులను ఆదుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా సాగునీటి సరఫరాపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని ఎర్రబెల్లి దయాకర్ రావు కోరారు.ఈ కార్యక్రమం లో పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# అశ్వారావుపేట అభివృద్ధికి ప్రత్యేక నిధులు

- సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేసిన ఎమ్మెల్యే జారె ఆదినారాయణ
- ఎంపీ రఘురామిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ రమేష్‌బాబు హాజరు
- మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తామని సీఎం హామీ

**అశ్వారావుపేట, తెలంగాణ చౌరస్తా:**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరుతూ ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎంపీ రామసహాయం రఘురామిరెడ్డి, అశ్వారావుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్‌బాబుతో కలిసి ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే నియోజకవర్గంలోని పలు సమస్యలను వివరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామీణ, గిరిజన ప్రాంతాలు అధికంగా ఉన్న అశ్వారావుపేట నియోజకవర్గంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి మరింత ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సరఫరా, విద్య, వైద్య రంగాలను మెరుగుపరిచేందుకు ప్రత్యేక నిధులు విడుదల చేయాలని ముఖ్యమంత్రిని కోరారు.

**ఐదు మండలాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు**

ఎమ్మెల్యే విజ్ఞప్తిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. అశ్వారావుపేట నియోజకవర్గ పరిధిలోని అశ్వారావుపేట, దమ్మపేట, ములకలపల్లి, అన్నపురెడ్డిపల్లి, చంద్రుగొండ మండలాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చినట్లు వెల్లడించారు.ముఖ్యమంత్రి స్పందనపై ఎమ్మెల్యే జారె ఆదినారాయణ హర్షం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలోని గ్రామీణ, గిరిజన ప్రాంతాలతో పాటు అన్ని మండలాలను అభివృద్ధి చేసి అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని పేర్కొన్నారు.



# రైటర్ బస్తి అయ్యప్ప ఆలయంలో భక్తిపారవశ్యం

- ఒకేరోజు వెయ్యి మందికి పైగా అయ్యప్ప స్వాముల మాలధారణ
- భక్తిశ్రద్ధలతో నిత్య అన్నదానం.. రాత్రి భిక్షా కార్యక్రమం

**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, తెలంగాణ చౌరస్తా :**

రైటర్ బస్తిలోని శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి ఆలయం బుధవారం భక్తుల శరణుఘోషతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. అయ్యప్ప స్వామి మాలధారణ కోసం తెల్లవారుజామున 5 గంటల నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలి వచ్చారు.ఒకేరోజు సుమారు వెయ్యి మందికి పైగా స్వాములు మాలధారణ స్వీకరించినట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు వెల్లడించారు. భక్తుల శరణు ఘోషతో ఆలయ ప్రాంగణమంతా మార్మోగింది.

**భక్తులకు నిత్య అన్నదానం.. భిక్షా కార్యక్రమం**

మాలధారణకు వచ్చిన స్వాములకు మధ్యాహ్నం 12 గంటల నుంచి ఆలయ చైర్మన్ డాక్టర్ ఎ. నాగరాజు ఆధ్వర్యంలో నిత్య అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రాత్రి నిర్వహించిన భిక్షా (అల్పాహార) కార్యక్రమాన్ని శ్రీ పాతూరి బాబూరావు ప్రారంభించారు.
ఈ కార్యక్రమంలో అయ్యప్ప దీక్షాపరులతో పాటు శివ, భవానీ, ఆంజనేయ స్వామి దీక్షాపరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఆలయానికి వచ్చే భక్తులు, స్వాములకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ ముందస్తు ఏర్పాట్లు చేపట్టింది. భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తూ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించింది.



## విద్యతోనే దేశాభివృద్ధి సాధ్యం..
# ఆజాద్ సేవలు చిరస్మరణీయం

- జాతీయ విద్యా దినోత్సవంలో ప్రొఫెసర్ తాళ్ల సుమాలిని
- విద్యార్థులు నూతన పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి

**శేరిలింగంపల్లి,తెలంగాణ చౌరస్తా :**

విద్యతోనే దేశాభివృద్ధి సాధ్యమని, భారత తొలి విద్యాశాఖ మంత్రి భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ విద్యారంగానికి అందించిన సేవలు చిరస్మరణీయమని హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం విద్య, విద్యా సాంకేతిక విభాగం ఆచార్యురాలు ప్రొఫెసర్ తాళ్ల సుమాలిని అన్నారు.
జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం కొత్తగూడ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం. పవన్ కుమార్ అధ్యక్షత వహించగా, ప్రొఫెసర్ తాళ్ల సుమాలిని ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ప్రొఫెసర్ సుమాలిని మాట్లాడుతూ..స్వాతంత్ర్యం అనంతరం దేశంలో విద్యాభివృద్ధికి ఆజాద్ చేసిన కృషి ప్రశంసనీయమని అన్నారు. విద్యా సంస్కరణలకు పునాదులు వేస్తూ యూజీసీ, ఏఐసీటీఈ, ఐఐటీ వంటి ప్రతిష్టాత్మక విద్యాసంస్థల అభివృద్ధికి ఆయన విశేషంగా కృషి చేశారని గుర్తుచేశారు. విద్య ద్వారా జ్ఞానం, ఆత్మవిశ్వాసం, సంస్కారం అలవడటంతో పాటు పేదరిక నిర్మూలన, సామాజిక అభివృద్ధి, దేశ ఆర్థిక ప్రగతి సాధ్యమవుతాయని వివరించారు.ప్రస్తుత సాంకేతిక యుగంలో విద్యార్థులు నూతన పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ప్రపంచస్థాయిలో పోటీపడాలని సూచించారు. అంతర్జాలాన్ని అవసరమైన మేరకే వినియోగిస్తూ సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ధూమపానం, మద్యపానం, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని హితవు పలికారు. పుస్తక పఠనం, భాషా నైపుణ్యాలు, చక్కని చేతిరాత, వ్యాయామం, ధ్యానానికి ప్రాధాన్యతనిస్తూ విలువలతో కూడిన విద్యను అభ్యసించాలని సూచించారు.విద్య ద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహించి, దేశాభివృద్ధికి తమ వంతు కృషి చేయడమే మౌలానా అబుల్ కలాం ఆజాద్‌కు అందించే నిజమైన నివాళి అని ప్రొఫెసర్ సుమాలిని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు శివరామకృష్ణ, ఉపాధ్యాయులు రామేశ్వరరెడ్డి, ప్రభాస్ కుమార్, మధు, జాఫర్, రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





# మన సంస్కృతి, సంప్రదాయాలు, వారసత్వానికి సదర్ ప్రతీక

- సదర్ వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ యువ నాయకుడు మల్‌రెడ్డి అభిషేక్‌రెడ్డి

**అబ్దుల్లాపూర్‌మెట్, తెలంగాణ చౌరస్తా :**

కుంట్లూర్ డివిజన్ పరిధిలోని తిమ్మాయిగూడెంలో గోపికృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన సదర్ సమ్మేళనం ఘనంగా జరిగింది. ఈ వేడుకలకు కాంగ్రెస్ యువ నాయకుడు మల్‌రెడ్డి అభిషేక్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై సందడి చేశారు. ఈ సందర్భంగా యాదవ సంఘం నాయకులు, నిర్వాహకులు ఆయనకు ఘన స్వాగతం పలికి సత్కరించారు. సదర్ వేడుకల్లో భాగంగా నిర్వహించిన దున్నపోతుల ప్రదర్శన, వాటి విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రత్యేకంగా అలంకరించిన దున్నపోతులను తిలకించేందుకు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు.ఈ సందర్భంగా మల్‌రెడ్డి అభిషేక్‌రెడ్డి మాట్లాడుతూ.. సదర్ వేడుకలు కేవలం వినోద కార్యక్రమాలు మాత్రమే కాదని, తరతరాలుగా వస్తున్న మన సంస్కృతి, సంప్రదాయాలు, వారసత్వానికి ప్రతీకగా నిలుస్తాయని పేర్కొన్నారు. యాదవుల ఆత్మగౌరవం, సంస్కృతి, సంప్రదాయాలతో పాటు పశుసంపద పరిరక్షణ ప్రాధాన్యతను ఈ వేడుకలు చాటిచెబుతాయని అన్నారు. ఇలాంటి సంప్రదాయ వేడుకలను భావితరాలకు అందించడంతో పాటు మన సంస్కృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో బాటసింగారం రైతు సహకార సంఘం అధ్యక్షుడు కొత్తపల్లి జైపాల్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ గ్యారల శ్రీనివాస్ గౌడ్, మాజీ సర్పంచ్ మూల మహేష్ గౌడ్, కుంట్లూర్ డివిజన్ అధ్యక్షుడు బీమగౌని భాస్కర్ గౌడ్, గ్రామ పెద్దలు, యువకులు, యాదవ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# న్యుమోనియాపై అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ తుకారామ్ రాథోడ్

**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, తెలంగాణ చౌరస్తా:**



న్యుమోనియా వ్యాధి పట్ల ప్రజలు తీవ్ర అప్రమత్తంగా ఉండాలని, సకాలంలో గుర్తిస్తే ప్రాణాపాయాన్ని అరికట్టవచ్చని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ తుకారామ్ రాథోడ్ తెలిపారు. ప్రపంచ న్యుమోనియా దినోత్సవం పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని వైద్య సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. న్యుమోనియా ఊపిరితిత్తులకు సోకే ఇన్ఫెక్షన్ అని, దీనివల్ల శ్వాస తీసుకోవడం కష్టమవుతుందని చెప్పారు.ముఖ్యంగా ఐదేళ్ల లోపు పిల్లలు, వృద్ధులు, రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు దీని బారిన పడతారన్నారు. బ్యాక్టీరియా, వైరస్, పొగ, వాయు కాలుష్యం,పోషకాహార లోపం వల్ల ఈ వ్యాధి వ్యాపిస్తుందని వెల్లడించారు.తీవ్ర జ్వరం, దగ్గు, వేగంగా శ్వాస తీసుకోవడం, ఛాతి నొప్పి, పిల్లల్లో ఛాతి లోపలికి లాగడం, పెదవులు నీలంగా మారడం వ్యాధి లక్షణాలని స్పష్టం చేశారు. సకాలంలో ప్రభుత్వ టీకాలు వేయించడం, 6 నెలలు తల్లిపాలు ఇవ్వడం, పరిశుభ్రత పాటించడం ద్వారా వ్యాధిని అరికట్టవచ్చన్నారు.శ్వాస ఇబ్బంది ఉంటే తక్షణమే ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించాలని సూచించారు.



# అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో డీఈఓ ఆకస్మిక తనిఖీలు

- విద్యార్థుల విద్యా సామర్థ్యాలపై ఆరా
- పదో తరగతిలో 100 శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా పనిచేయాలి
- తట్టిఅన్నారం డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో కొత్త పాఠశాల ఏర్పాటుకు పరిశీలన

**అబ్దుల్లాపూర్‌మెట్, తెలంగాణ చౌరస్తా:**

మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన, మౌలిక వసతుల పరిస్థితులను పరిశీలించేందుకు జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) వెంకటేశ్వర్లు బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కుంట్లూర్ జెడ్పీహెచ్ఎస్, ఎంపీపీఎస్ పాఠశాలలతో పాటు తట్టిఅన్నారం జెడ్పీహెచ్ఎస్, ఎంపీపీఎస్ పాఠశాలలను సందర్శించి విద్యా ప్రమాణాలను పరిశీలించారు.
తనిఖీల్లో భాగంగా విద్యార్థులతో నేరుగా మాట్లాడిన డీఈఓ పలు ప్రశ్నలు అడిగి వారి విద్యా సామర్థ్యాలను తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. పదో తరగతి విద్యార్థులు ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా చదువుతూ వార్షిక పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని సూచించారు. ఉన్నత చదువులు అభ్యసించి తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ప్రతి విద్యార్థిలో అన్ని రకాల విద్యా సామర్థ్యాలను పెంపొందించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు.

**కొత్త ప్రాథమిక పాఠశాల ఏర్పాటుకు పరిశీలన**

తట్టిఅన్నారం డబుల్ బెడ్‌రూమ్ కాలనీ ప్రజల విజ్ఞప్తి మేరకు అక్కడ కొత్త ప్రాథమిక పాఠశాల ఏర్పాటు చేసే అవకాశాలను డీఈఓ వెంకటేశ్వర్లు స్వయంగా పరిశీలించారు. పాఠశాల ఏర్పాటుకు అవసరమైన స్థలం, మౌలిక వసతుల లభ్యతపై అధికారులతో చర్చించారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి జగదీష్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కొండల్‌రెడ్డి, విశ్వప్రసాద్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# తండ్రి లేని నిరుపేద ఆడబిడ్డల వివాహాలకు ఉప్పల శ్రీనివాస్ గుప్త చేయూత

- పెద్దన్నలా అండగా నిలిచి పుస్తె మట్టెలు, పెళ్లి చీరలు, గాజుల అందజేత
- పేదలకు అండగా నిలవడమే ఉప్పల ఫౌండేషన్ లక్ష్యం

**ఎల్బీనగర్, తెలంగాణ చౌరస్తా:**



తండ్రి లేని నిరుపేద ఆడబిడ్డల వివాహాలకు ఉప్పల ఫౌండేషన్ వ్యవస్థాపకులు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్త పెద్దన్నలా అండగా నిలిచారు. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న రెండు నిరుపేద కుటుంబాలకు చెందిన యువతుల వివాహాల సందర్భంగా ఫౌండేషన్ తరఫున పుస్తె మట్టెలు, పెళ్లి చీరలు, గాజులను అందజేసి తన ఔదార్యాన్ని చాటుకున్నారు.ఫతుల్లాగూడకు చెందిన రోహిణి, తన సొంత గ్రామమైన లక్ష్మీదేవపల్లికి చెందిన మౌనిక వివాహాలకు ఈ సహాయాన్ని అందించారు. నాగోలులో నిర్వహించిన కార్యక్రమంలో ఐవీఎఫ్ ప్రథమ మహిళ ఉప్పల స్వప్న కుమారుడు ఉప్పల సాయి కిరణ్, సాయి తేజ, కోడలు శార్వరి చేతుల మీదుగా రోహిణి కుటుంబానికి వివాహ సామగ్రిని అందజేశారు. అదేవిధంగా లక్ష్మీదేవపల్లికి చెందిన మౌనిక కుటుంబానికి కూడా ఉప్పల ఫౌండేషన్ ద్వారా అవసరమైన సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ.. తండ్రి లేకపోవడంతో ఇళ్లలో పనిచేస్తూ తమ పిల్లలను పోషిస్తున్న తల్లుల కష్టాలను గుర్తించి ఈ సహాయం అందించాలని నిర్ణయించినట్లు తెలిపారు. రాజకీయాలు, కులమతాలకు అతీతంగా ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు అండగా నిలవడమే ఉప్పల ఫౌండేషన్ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చారి, స్థానిక కాలనీ, దళిత సంఘాల ప్రతినిధులు, బాధిత కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రతి ఊరుకు రోడ్డు సౌకర్యం కల్పిస్తాం

- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

**తొర్రూరు-తెలంగాణ చౌరస్తా:**

పాలకుర్తి నియోజకవర్గంలో ప్రతి ఊరుకు రోడ్డు సౌకర్యం కల్పిస్తామని ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి స్పష్టం చేశారు.తొర్రూరు నుండి కంటాయపాలెం గ్రామం వరకు రూ.6 కోట్ల గిరిజన సంక్షేమ శాఖ నిధులతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు బుధవారం పాలకుర్తి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ....గ్రామీణ రహదారుల నిర్మాణం, మరమ్మతులకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నదన్నారు.దాంతో తండాలు, గ్రామీణ ప్రాంత రహదారులు కొత్త రూపు సంతరించుకొని.. రవాణా సౌకర్యం మెరుగుపడనున్నదన్నారు. వాహనదారుల ఇబ్బందులు తొలగనున్నాయన్నారు.ఇప్పటికే విరివిగా రోడ్ల నిర్మాణాలు జరిగాయని, సీఎం, సంబంధిత మంత్రుల చొరవతో అవసరం ఉన్న ప్రతి చోటా వందల కోట్ల రూపాయలతో రహదారులను నిర్మిస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రోడ్ల పరిస్థితి మెరుగుపడిందని,నియోజకవర్గంలో ఇంకా రోడ్లకు నోచుకోని గ్రామాలను గుర్తిస్తూ ప్రభుత్వ నిధులను మంజూరు చేస్తున్నదన్నారు.సీఎం రేవంత్ రెడ్డి పాలనలో రోడ్లన్నీ బాగుపడ్డాయన్నారు. ఎల్ నినో కష్టకాలంలోనూ మారుమూల తండాలకు కూడా రహదారులు వేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తూనం శ్రావణ్ కుమార్, వైస్ చైర్మన్ సోమ రజిని రాజశేఖర్,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోత్కూరి రవీంద్ర చారి,పట్టణ అధ్యక్షుడు ముద్దసాని సురేష్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు బచ్చలి లక్ష్మణ్,ఆర్ అండ్ బి డి.కృష్ణ మోహన్,ఏఈ మహేష్, కాంగ్రెస్ నాయకులు చాపల బాపురెడ్డి,పెదగాని సోమయ్య, జక్కుల మహబూబ్ రెడ్డి, చింతకుంట్ల శ్రీనివాస్ రెడ్డి, మేకల కుమార్, వెంకట్ రెడ్డి,వెంకన్న యాదవ్,చెవిటి సుధాకర్, బిక్షం గౌడ్,ఇంద్రసేనారెడ్డి,వెలుగు మహేశ్వరి,మహేష్ యాదవ్, మోకాటి వెంకన్న ఎనగందుల శ్రీనివాస్, పంజాల అల్లూరు, అనిత, రాణి, భవాని, భరత్ తదితరులు పాల్గొన్నారు.

# చేయూత పెన్షన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి

- నేడే కొత్తగూడెం క్లబ్‌లో పంపిణీ
- ఎంపీడీఓ సుస్మిత
- హాజరుకానున్న ఎమ్మెల్యే కూనంనేని




భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో,తెలంగాణ చౌరస్తా : మండలానికి నూతనంగా మంజూరైన చేయూత పెన్షన్ల పంపిణీ కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు లక్ష్మీదేవిపల్లి మండల ప్రజా పరిషత్ అధికారులు తెలిపారు. గురువారం మధ్యాహ్నం 3:30 గంటలకు కొత్తగూడెం క్లబ్‌లో ఈ పంపిణీ కార్యక్రమం జరుగుతుందని వెల్లడించారు.
ఈ కార్యక్రమానికి కొత్తగూడెం నియోజకవర్గ శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు స్వయంగా పెన్షన్లు అందజేస్తారని తెలిపారు. మండల పరిధిలోని ప్రజాప్రతినిధులు, అధికారులు మరియు నూతన చేయూత పెన్షన్ లబ్ధిదారులు అందరూ నిర్దేశిత సమయానికి హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎంపీపీ, ఎంపీడీఓ సుస్మిత కోరారు.

# నిధులున్నా.. మూడేళ్లుగా పూర్తికాని డ్రైనేజీ పనులు

- అధికారుల నిర్లక్ష్యంపై మాజీ కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి ఆగ్రహం
- అసంపూర్తి పనులకు నిరసనగా కాలనీవాసులతో కలిసి రోడ్డుపై బైఠాయింపు

**ఎల్బీనగర్, తెలంగాణ చౌరస్తా:**



మంజూరైన నిధులు అందుబాటులో ఉన్నప్పటికీ అభివృద్ధి పనులను పూర్తి చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని హయత్‌నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి మండిపడ్డారు. ముదిరాజ్ కాలనీ నుంచి మునుగనూర్ కల్వర్టు వరకు చేపట్టాల్సిన డ్రైనేజీ ట్రంక్‌లైన్ పనులు మూడేళ్లు గడిచినా పూర్తికాకపోవడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అసంపూర్తిగా నిలిచిపోయిన పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ కాలనీవాసులతో కలిసి రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నవజీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. మూడు విడతలుగా చేపట్టాల్సిన డ్రైనేజీ పనులను మధ్యలోనే నిలిపివేయడంతో ముదిరాజ్ కాలనీ, లక్ష్మీప్రియ కాలనీ, దుర్గా నగర్, శివాజీ నగర్ తదితర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మూడేళ్ల క్రితమే నిధులు మంజూరైనప్పటికీ పనులు ఎందుకు పూర్తి చేయడం లేదని అధికారులను ప్రశ్నించారు. కాగితాలపై అభివృద్ధి చూపించడం కాకుండా క్షేత్రస్థాయిలో పనులు పూర్తి చేసి ప్రజల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. డ్రైనేజీ పనులను తక్షణమే పునఃప్రారంభించి నిర్దిష్ట సమయంలో పూర్తి చేయాలని, లేనిపక్షంలో కాలనీవాసులతో కలిసి ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు గంగాని శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఇట్టబోయిన నర్సింహా, నాయకులు జనార్దన్, జంగా రెడ్డి, వివిధ కాలనీల సంక్షేమ సంఘాల అధ్యక్షులు, ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో కాలనీవాసులు పాల్గొన్నారు.

# ఒంగోలులో బాలల ప్రపంచ తెలుగు మహాసభలు

- 16 ఏళ్లలోపు బాలబాలికలకు కవి సమ్మేళనం, కథలు, పద్య పఠనం, ఏకపాత్రాభినయ పోటీలు
- నవంబర్ 15లోపు పేర్ల నమోదు చేసుకోవాలి దొనికెన కుమారస్వామి

**తొర్రూరు, తెలంగాణ చౌరస్తా:**



**నవంబర్ 15లోపు పేర్ల నమోదు**

ఆంధ్ర సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో 'బాలల 4వ ప్రపంచ తెలుగు మహాసభలు 2026' డిసెంబర్ 19, 20 తేదీల్లో ఒంగోలులో నిర్వహించనున్నట్లు చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దొనికెన కుమారస్వామి తెలిపారు. ఒంగోలులోని నెక్స్ట్ జెన్ ఇంటర్నేషనల్ స్కూల్ వేదికగా రెండు రోజులపాటు ఈ మహాసభలు జరగనున్నాయని వెల్లడించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న 16 ఏళ్లలోపు తెలుగు బాల బాలికలు ఈ మహాసభల్లో పాల్గొని తమ ప్రతిభను చాటుకోవాలని పిలుపునిచ్చారు. కవి సమ్మేళనం, కథా రచన, పద్య పఠనం, ఏకపాత్రాభినయం తదితర పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. తెలుగు భాష, సాహిత్యం, సంస్కృతిపై బాలల్లో ఆసక్తిని పెంపొందించడంతో పాటు వారి సృజనాత్మక ప్రతిభకు వేదిక కల్పించడమే ఈ మహాసభల ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. సభలకు ఎంపికైన బాలబాలికలకు ఉచిత వసతి, భోజన సదుపాయాలు కల్పించనున్నట్లు తెలిపారు. అంతేకాకుండా బాలలతో పాటు వచ్చే తల్లిదండ్రుల్లో ఒకరిని సభల సందర్భంగా ప్రత్యేకంగా సన్మానించనున్నట్లు దొనికెన కుమారస్వామి వెల్లడించారు.



# గ్రామీణ యువతకు ఏఐ శిక్షణతో ఉపాధి బాట

- ఇల్లందకుంటలో ఉచిత శిక్షణ కేంద్రం ప్రారంభం
- కంప్యూటర్ ప్రాథమిక పరిజ్ఞానం నుంచి కృత్రిమ మేధస్సు వరకు ఉచిత తర్ఫీదు

**హుజూరాబాద్ , తెలంగాణ చౌరస్తా:**




గ్రామీణ యువతలో సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించి, ఆధునిక ఉద్యోగ అవకాశాలకు చేరువ చేయడమే లక్ష్యంగా ఇల్లందకుంట మండల కేంద్రంలో ఉచిత ఏఐ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. యూటీవీ, టూరిటో సంస్థల వ్యవస్థాపకులు పాడి ఉదయనందన్‌రెడ్డి బుధవారం ఈ కేంద్రాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మారుతున్న సాంకేతిక ప్రపంచానికి అనుగుణంగా కంప్యూటర్ పరిజ్ఞానంతో పాటు కృత్రిమ మేధస్సు (ఏఐ)పై అవగాహన ప్రతి ఒక్కరికీ అవసరమని అన్నారు. పట్టణ విద్యార్థులకు దీటుగా గ్రామీణ ప్రాంతాల యువత కూడా సాంకేతిక రంగంలో రాణించాలనే సంకల్పంతో ఈ ఉచిత శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కంప్యూటర్ ప్రాథమిక పరిజ్ఞానం నుంచి ఆధునిక ఏఐ సాంకేతికత వరకు ఉచితంగా శిక్షణ అందించనున్నట్లు వెల్లడించారు.

**అన్ని రంగాల్లో ఏఐకి పెరుగుతున్న ప్రాధాన్యత**

ప్రస్తుతం వ్యవసాయం, వైద్యం, విద్య, వ్యాపారం, మీడియా తదితర అన్ని రంగాల్లో కృత్రిమ మేధస్సు వినియోగం వేగంగా పెరుగుతోందని ఉదయనందన్‌రెడ్డి పేర్కొన్నారు. ఏఐ నైపుణ్యాలను నేర్చుకోవడం ద్వారా యువత ఉద్యోగ అవకాశాలను పొందడమే కాకుండా స్వయం ఉపాధి మార్గాలను కూడా ఎంచుకోవచ్చని తెలిపారు.గ్రామీణ ప్రాంతాల్లోని యువత ప్రతిభకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి వారి భవిష్యత్తుకు బాటలు వేయడమే ఈ శిక్షణ కేంద్రం ప్రధాన లక్ష్యమని వివరించారు. ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకుని సాంకేతిక రంగంలో తమకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# పెద్దపల్లి ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శిగా తిర్రీ తిరుపతి గౌడ్

- ఏకగ్రీవంగా ఎన్నుకున్న పెద్దపల్లి ప్రెస్ క్లబ్ సభ్యులు

**పెద్దపల్లి, తెలంగాణ చౌరస్తా :**



పెద్దపల్లి ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శిగా తిర్రీ తిరుపతి గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం పెద్దపల్లి ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో క్లబ్ కమిటీ సభ్యులు ఆయన పేరును ఏకగ్రీవంగా ఆమోదిస్తూ తీర్మానం చేశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ప్రధాన కార్యదర్శి తిర్రీ తిరుపతి గౌడ్‌కు పలువురు జర్నలిస్టులు, ప్రెస్ క్లబ్ సభ్యులు శుభాకాంక్షలు తెలియజేసి అభినందించారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేయడంతో పాటు, ప్రెస్ క్లబ్ అభివృద్ధికి, పాత్రికేయుల సంక్షేమానికి, జర్నలిస్టుల ఐక్యతకు ఆయన కృషి చేయాలని పలువురు ఆకాంక్షించారు.